క్లుప్తంగా

పంటలకు సాగునీరు విడుదల చేయాలి

ఆత్మకూరు : నారు మడులకు ఆత్మకూరు పెద్ద చెరువు నుంచి నీటిని విడుదల చేయాలని పెద్ద చెరువు పారకం రైతులు సోమవారం ఒక ప్రకటనలో కోరారు. నీరు లేకపోవడంతో నాట్లు ఎండిపోతున్నాయని, అధికారులు వెంటనే నీటిని విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు.

నూతన కార్యవర్గం ఎన్నిక


మార్క అశోక్

కమలాపూర్ : మండల కేంద్రానికి చెందిన శ్రీకంఠమహేశ్వర కళామండలి నూతన అధ్యక్షుడిగా మార్క అశోక్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక కళామండలి కమిటీ హాల్‌లో సోమవారం మాజీ అధ్యక్షుడు మంద భిక్షపతి అధ్యక్షతన జరిగిన సర్వసభ్య సమావేశం జరుగగా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా పచ్చిమట్ల రాజేశ్‌గౌడ్, పబ్బు రాము, ప్రధాన కార్యదర్శిగా పెరుమాండ్ల పర్శరాములు, కోశాధికారిగా మార్క రవి, గౌరవ అధ్యక్షులుగా పబ్బు సతీష్, బాలసాని దేవేందర్‌గౌడ్, కార్యవర్గ సభ్యులుగా చిన్నకు మారస్వామి, గోపాల్, లక్ష్మణ్, తిరుపతి, ఓదెలు తదితరులు ఎన్నికయ్యారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

ఆత్మకూరు : పేకాడుతున్న ఆరుగురిని అరెస్టు చేసినట్లు ఎస్సై తిరుపతి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ఆత్మకూరు పీఎస్ పరిధిలోని దామెర మండలంలో గల దుర్గంపేటలో సోమవారం పెట్రోలింగ్‌లో నిర్వహిస్తుండగా ముదురుకోళ్ల రాజశేఖర్ ఇంటివద్ద గుర్రం చంద్రమౌళి, నూకల వినయ్, పుచ్చకాయల రాజు, ముదురుకోళ్ల రాజశేఖర్, కర్నాటకం రాంకి, పర్వతం రాజేందర్ పేడుతున్నట్లు సమాచారం వచ్చిందని తెలిపారు. దీంతో దాడులకు వెళ్లిన పోలీసులను చూసి పారిపోయే ప్రయత్నం చేయగా పట్టుకున్నట్లు తెలిపారు. వారినుంచి రూ.1,440 నగదు, 52పేక ముక్కలు స్వాధీనం చేసుకుని ఆరుగురిని అరెస్టు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

మూగజీవాల వ్యాక్సిన్లు పంపిణీ చేయాలి

ఐనవోలు : గొర్రెలు, మేకలకు సంక్రమించే వివిధ రకాల రోగాలను నివారించేందుకు మందులు, వ్యాక్సిన్లను ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేయాలని గొర్రెల, మేకల పెంపకం దారుల సంఘం(జీఎంపీఎస్) ప్రధాన కార్యదర్శి కాడబోయిన లింగయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం తహసీల్దార్ విక్రమ్‌కుమార్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా లింగయ్య మాట్లాడుతూ.. నట్టల మందులతో పాటు వివిధ రకాల మందులు గతంలో పంపిణీ చేశారని, కానీ ప్రస్తుతం పంపిణీ ఆగపోయిందన్నారు. ఈ సమస్యను వెటర్నరీ అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని తహసీల్దార్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం మండల అధ్యక్షుడు దయాకర్, కార్యదర్శి చిన్నరాజు, బజ్జేల్ ఉన్నారు.

పురుగులమందు తాగిన పదో తరగతి విద్యార్థి

ఐనవోలు : పురుగులమందు తాగి విద్యార్థి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ సంఘటన ఒంటిమామిడిపల్లిలో సోమవారం చోటు చేసుకుంది. స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. ఒంటిమామిడిపల్లి ప్రభుత్వ పాఠశాలలో తోట వినయ్ 10వ తరగతి చదువుతున్నాడు. విద్యార్థి చదవడం లేదని, ప్రవర్తన సరిగా లేదని పాఠశాల టీచర్, పేరెంట్స్ కమిటీ చైర్మన్ సోమవారం వినయ్ తల్లి రజితకు ఫోన్ ద్వారా తెలిపారు. దీంతో ఇంటికి వెళ్తే తల్లి తనను మందలిస్తుందనే భయంతో సదరు విద్యార్థి స్నేహితుడి వద్ద వాపోయాడు. ఇంటికి చేరుకున్న వినయ్ సోమవారం రాత్రి పురుగులమందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అయితే గతంలో వినయ్ ప్రవర్తన గురించి తల్లి, అన్నను స్కూల్‌కు పిలిపించి టీచర్లు, పేరెంట్స్ కమిటీ సభ్యులు మాట్లాడినట్లు తెలిసింది. అయితే సోమవారం స్కూల్‌లో ఏం జరిగింది? పురుగుల మందు తాగడానికి కారణాలేంటి అనేది తెలియాల్సి ఉంది. వినయ్ తండ్రి గతంలో ఆత్మహత్యకు చేసుకున్నాడు. విజయ్‌కి తల్లి రజిత, సోదరుడు ప్రణయ్ ఉన్నారు.

ఆరోగ్య పరిరక్షణలో శుభ్రత కీలకం

నెక్కొండ : ఆరోగ్య పరిరక్షణలో శుభ్రత కీలకమని పీహెచ్‌సీ వైద్యాధికారి సుమన్ తెలిపారు. మండలంలోని పనికర, చంద్రుగొండ గ్రామాల్లో సోమవారం జ్వర సర్వే నిర్వహించారు. ఇంటింటికీ తిరుగుతూ వర్షాకాలంలో జ్వరాల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ముందస్తు జాగ్రత్తలు పాటిస్తే సీజనల్ వ్యాధుల బారిన పడకుండా కాపాడుకోవచ్చని చెప్పారు. ప్రతిఒక్కరూ వ్యక్తిగత, పరిసరాల శుభ్రత పాటించాలని సూచించారు. జ్వరం, దగ్గు, ఇతర అనారోగ్య సమస్యలు వస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలని ఈ సందర్భంగా డాక్టర్ సూచించారు. అనంతరం వైద్యశిబిరం ఏర్పాటు చేసిన పలువురికి వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యులు రాహుల్, మౌనిక, ఏఎన్‌ఎంలు, ఆశవర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.

పశువులకు అడ్డాగా ప్రకృతివనం

- మొక్కలు లేని పట్టణ ప్రకృతి వనం
- కనిపించని పిల్లల ఆటవస్తువులు
- మున్సిపల్ అధికారులపై విమర్శలు


పిచ్చిమొక్కలు, పచ్చని గడ్డితో నిండిపోయిన పరకాలలోని పట్టణ ప్రకృతివనం

పరకాల : మొక్కలు నాటడంపై చూపించే ఉత్సాహం వాటిని రక్షించడంలో మున్సిపాలిటీ అధికారులు చూపడంలేదనే విమర్శలు వస్తున్నాయి. పట్టణ ప్రకృతి వనాల్లో మొక్కలు, పిల్లలు ఆడుకునే వస్తువులతో ఆకట్టుకోవాల్సిన పట్టణంలోని ప్రకృతి వనం పచ్చని గడ్డితో పశువులకు అడ్డాగా మారిందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో నాలుగేళ్ల క్రితం ఏర్పాటు చేసిన పట్టణ ప్రకృతివనంలో మొక్కలు కరువయ్యాయని పలువురు అసహనం వ్యక్తం చేస్తున్నారు. మొక్కల సంరక్షణ కోసం గత పాలక మండలి లక్షల రూపాయలు వెచ్చించి ఫెన్సింగ్, గేట్ ఏర్పాటు చేసింది. అయితే గుర్తుతెలియని వ్యక్తులు గేట్ తాళం ధ్వంసం చేయగా కొందరు కార్లు పార్కింగ్ చేస్తుండగా పశువులు పచ్చిక మేస్తూ సేదదీరుతున్నాయి. మొక్కల పెంపకానికి రాష్ట్ర ప్రభుత్వం లక్షల రూపాయలు ఖర్చు చేస్తున్నా స్థానిక మున్సిపల్ ఉద్యోగులు, సిబ్బంది నాటిన మొక్కలకు నీళ్లు పట్టకపోవడంతో మొక్కలు చనిపోయినట్లు పట్టణవాసులు ఆరోపిస్తున్నారు. ఇతర జిల్లాల్లో చేపట్టిన మొక్కల సంరక్షణ చర్యలను ఆదర్శంగా తీసుకోవాలని పలువురు సూచిస్తున్నారు.

ఇసుక దందాకు తెరలేపితే ఉపేక్షించం

- ఎమ్మెల్యే సత్యనారాయణరావు


లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సత్యనారాయణరావు

శాయంపేట : ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల పేరిట ఎవరైనా ఇసుక దందాకు తెరలేపితే ఉపేక్షించేదిలేదని, అక్రమార్కులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు హెచ్చరించారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో సోమవారం పలువురు లబ్ధిదారులకు ప్రభుత్వం నుంచి మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఆయన పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు జరుగుతున్న నేపథ్యంలో దళారులు ఇసుక దందాకు తెరలేపితే సహించేదిలేదని, తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రాజీవ్ యువ వికాసం లబ్ధిదారుల ఎంపికలో, రేషన్‌కార్డు పంపిణీలో ఎవరైనా డబ్బులు వసూలు చేస్తే ఊరుకునేదిలేదన్నారు. సీఎం సహాయనిధి పేదలకు వరంగా నిలుస్తోందన్నారు. భూపాలపల్లి నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి పథంలో నడుపిస్తున్నట్లు చెప్పారు. నియోజకవర్గ కేంద్రంలో రూ.47కోట్ల నిధులతో ప్రభుత్వ ఐటీఐ కళాశాలను ప్రారంభించామని, అందులో చదువుకున్న విద్యార్థులకు క్యాంపస్ ప్లేస్‌మెంట్స్ ద్వారా టాటా కంపెనీలో ఉద్యోగ అవకాశాలు వస్తాయన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కోసం 80మంది ఎమ్మెల్యేలు ఢిల్లీకి వెళ్తున్నట్లు చెప్పారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను ప్రజలు ఆశీర్వదించాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కేంద్ర పథకాలను ప్రజలకు వివరించాలి


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న బీజేపీ నాయకులు

ఐనవోలు : కేంద్రం ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను మండలంలోని ప్రజలకు వివరించాలని బీజేపీ వర్ధన్నపేట నియోజకవర్గ మాజీ కన్వీనర్ శ్రీరామ్ భూపాల్, మండల ప్రభారీ రంజిత్ కార్యకర్తలకు సూచించారు. భారత ప్రధాని నరేంద్ర మోదీ 11 సంవత్సరాల పాలనలో జరిగిన అభివృద్ధితో పాటు కాంగ్రెస్ పార్టీ వైఫల్యాలను ప్రజలకు వివరించాలన్నారు. సోమవారం మండల కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో మండల అధ్యక్షుడు ప్రణయ్ అధ్యక్షతన మహాసంపర్క్ అభియాన్‌కు సంబంధించిన కరపత్రం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. స్థానిక ఎన్నికల్లో బీజేపీ గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు, నాయకులు పనిచేయాలన్నారు. 'కాంగ్రెస్, బీఆర్ఎస్ దొందు దొందే, పెంక నుంచి పొయ్యిలోకి తెలంగాణ, హిందు విరోధి దేశ విరోధి' అని ముద్రించిన కరపత్రాలను ప్రతీ ఇంటికి పంపిణీ చేసేందుకు మహా సంపర్క్ అభియాన్ కార్యక్రమం చేపట్టినట్లు పేర్కొన్నారు. జిల్లా కోశాధికారి మహేష్‌గౌడ్, మండల ప్రధాన కార్యదర్శులు రవితేజ, రాజు, ఉపాధ్యక్షుడు ఆనందం, కార్యదర్శి విక్రమ్, శక్తి కేంద్రం ఇన్‌చార్జ్‌లు రాజేష్, కిరణ్, రమేష్, వెంకటేష్ పాల్గొన్నారు.

మోడల్‌స్కూల్‌లో స్పాట్ అడ్మిషన్లు

కమలాపూర్ : మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో ఆరు నుంచి పదో తరగతిలో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీ కోసం ఈనెల 5,6,7వ తేదీల్లో స్పాట్ అడ్మిషన్లు కల్పిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ అనిత సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లతో నేరుగా పాఠశాలకు రావాలని సూచించారు. స్పాట్ అడ్మిషన్లలో సీట్లు పొందిన విద్యార్థులకు హాస్టల్ వసతి ఉండదని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు.

విద్యార్థులకు బ్యాగుల పంపిణీ



నడికూడ : మండలంలోని కొకొండ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు సోమవారం హనుమకొండ జిల్లా లయన్స్‌క్లబ్ కనుకదుర్గ 320ఎఫ్ ఆధ్వర్యంలో స్కూల్ బాగ్యులు పంపిణీ చేశారు. ప్రధానోపాధ్యాయుడు రావుల రమేశ్, లయన్స్ క్లబ్ ప్రతినిధి సులోచన, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నారాయణకు వీడ్కోలు సన్మానం



కమలాపూర్ : తొమ్మిదనరేళ్లుగా డీఆర్డీఏ (సెర్ప్) మండల ఏపీఎంగా పనిచేసి ఇటీవల బదిలీపై వెళ్లిన నారాయణకు సిబ్బంది సోమవారం ఘనంగా వీడ్కోలు సన్మానం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీఎం నారాయణను శాలువాతో సత్కరించారు. ఆయన స్థానంలో నూతన ఏపీఎంగా లలితాదేవి బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో మండల సమాఖ్య అధ్యక్షురాలు సుజాత, స్రవంతి, సృజన, సీసీలు మౌనిక, శ్రీదేవి, మహేందర్, కుమారస్వామి, సదాలక్ష్మి, మమత, సిబ్బంది శ్రీకాంత్, పుష్ప, సారయ్య, వీఓఏలు పాల్గొన్నారు.

ఏపీఎంగా వేణుగోపాల్‌రావు


మొక్క అందజేస్తున్న సిబ్బంది

శాయంపేట : మండలంలోని సురేఖ మండల సమాఖ్య అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్‌గా ఎర్రబెల్లి వేణుగోపాల్‌రావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా సురేఖ మండల సమాఖ్య సభ్యులు, సీసీలు, కార్యాలయ సిబ్బంది మొక్క అందించి శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో సురేఖ మండల సమాఖ్య అధ్యక్షురాలు గడిపే సుమలత, కార్యదర్శి అమ్మ వసంత, సీసీలు గాజుల కేదారి, గుర్రం విజయ్‌కుమార్, దొమ్మటి ప్రభాకర్, బొట్ల హేమలత, కార్యాలయ సిబ్బందితో పాటు తదితరులు పాల్గొన్నారు.

ప్రాణభయం ఉంది.. రక్షణ కల్పించండి

- భూతగాదా విషయమై చంపాలని చూస్తున్నారు..
- హత్యాయత్నం కేసు నమోదు చేయాలని మహిళ వినతి


తమకు న్యాయం చేయాలని వేడుకుంటున్న విజయ, ఆమె కుటుంబీకులు

కమలాపూర్: మండలంలోని కానిపర్తికి చెందిన వడ్లకొండ శ్రీనివాస్ కుటుంబీకులతో తమకు ప్రాణభయం ఉందని, వారి నుంచి తమకు రక్షణ కల్పించాలని ఆ గ్రామానికే చెందిన వడ్లకొండ విజయ, ఆమె కూతుళ్లు స్రవంతి, చందన వేడుకున్నారు. మండల కేంద్రంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు.. తమకున్న పొత్తుల బావి విషయంలో జరుగుతున్న భూతగాదాను దృష్టిలో పెట్టుకొని శ్రీనివాస్ కుటుంబీకులు తమపై పలుమార్లు దాడిచేశారని ఆరోపిస్తూ, తమపై జరిగిన దాడికి సంబంధించిన ఫొటోలను చూపించారు. గతనెల 28న తమపై హత్యాయత్నం చేసి ఐదు తులాల బంగారు ఆభరణాలు, నగదు, సెల్‌ఫోన్ లాక్కెళ్లారని, తాము ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా తమపైనే కేసు పెట్టారని, తామిచ్చిన ఫిర్యాదులో నుంచి కొందరిని తప్పించారని ఆరోపించారు. తమపై హత్యాయత్నం చేసిన శ్రీనివాస్ కుటుంబీకులపై హత్యాయత్నం కేసు నమోదు చేసి వెంటనే అరెస్ట్ చేయాలని కోరారు. తమ భూమిని కొంత దొంగ పట్టా చేయించుకున్నారని, తమ భూమి తమకు ఇప్పించి న్యాయం చేయాలని వేడుకున్నారు. ఈ విషయమై ఇన్‌స్పెక్టర్ హరికృష్ణను వివరణ కోరగా ఇరువర్గాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఇరువర్గాలపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

బీసీలంతా ఐక్యంగా పోరాడాలి


నూతన కమిటీ సభ్యులతో మల్లేశంగౌడ్

పరకాల : రాబోయే రోజుల్లో రాష్ట్రంలో ముఖ్యమంత్రి సీటులో బీసీ నేతను కూర్చోబెట్టేందుకు బీసీలంతా ఐక్యంగా పోరాడాలని బీసీ సంక్షేమ సంఘం పరకాల నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆముదాలపల్లి మల్లేశంగౌడ్ పిలుపునిచ్చారు. ఈ మేరకు సోమవారం పరకాల మండలంలోని వెల్లంపల్లిలో బీసీ సంక్షేమ సంఘం కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మారబోయిన సునీల్, ఉపాధ్యక్షుడిగా బండి చందు, ప్రధాన కార్యదర్శిగా ఓంకార్, కార్యదర్శులుగా శివప్రసాద్, దినేష్, కోశాధికారిగా రవీందర్‌ను ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా మల్లేశంగౌడ్ మాట్లాడారు. తెలంగాణలో అధికారం దక్కించుకోవాలంటే రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీల సత్తా చాటాలని పిలుపునిచ్చారు. బీసీ మండల నాయకులు సతీశ్, లింగన్న, హరీష్, సాయికుమార్, రాజేష్ పాల్గొన్నారు.

జిల్లా మహాసభను జయప్రదం చేయాలి


ధర్మసాగర్ : మాట్లాడుతున్న విశ్వనాథ్

ధర్మసాగర్ / వేలేరు : ఈనెల 7న హసన్‌పర్తి మండలం చింతగట్టులోని ఎన్‌టీఆర్ గార్డెన్‌లో నిర్వహించనున్న జిల్లా మహాసభను జయప్రదం చేయాలని ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు, వరంగల్, హనుమకొండ, జనగామ జిల్లాల ఇన్‌చార్జ్ వైకే విశ్వనాథ్, ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ హనుమకొండ జిల్లా ఇన్‌చార్జ్ కందుకూరి సోమన్న పిలుపునిచ్చారు. సోమవారం ధర్మసాగర్, వేలేరు మండల కేంద్రాల్లో ఎమ్మెస్పీ జిల్లా ప్రధాన కార్యదర్శి గంగారపు శ్రీనివాస్ అధ్యక్షతన సోమవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన 6 గ్యారంటీల్లో ప్రకటించిన వికలాంగుల, వృద్ధుల, వితంతువుల ఒంటరి మహిళల, చేనేత, బీడీ, గీత కార్మికుల పింఛన్లు పెంచుతామని హామీ ఇచ్చినట్లు గుర్తుచేశారు. ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని, లేని పక్షంలో ప్రభుత్వంపై పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. పింఛన్ పెంచేవరకు మంద కృష్ణ మాదిగ నాయకత్వంలో పింఛన్‌దారులందరినీ ఐక్యం చేసి పోరాటం చేస్తామన్నారు. ఈనెల 13న హైదరాబాద్‌లో లక్షలాది మందితో పింఛన్‌దారుల మహాగర్జన ఉంటుందని తరలిరావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల శాఖ అధ్యక్షుడు సోంపల్లి అన్వేష్, పుట్ట ప్రశాంత్, సింగారపు పవన్, చిలుక రాజు, కొట్టే శంకర్, ప్రణయ్, పవన్, బుచ్చిరాములు, చిలుక మధుకర్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయాలను కొనసాగించాలి

- రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రకాశ్


అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు

ఎల్కతుర్తి : భారత రాజ్యాంగ నిర్మాణ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాలను కొనసాగించాలని అంబేడ్కర్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెప్యాల ప్రకాశ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కంటి దయాకర్ అన్నారు. మండలంలోని దామెర గ్రామంలో అంబేడ్కర్ విగ్రహాన్ని సోమవారం ఆవిష్కరించారు. అనంతరం సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అంటరానితనం అనుభవించి దాన్ని రూపుమాపడానికి పోరాటం చేశారని గుర్తుచేశారు. భారత రాజ్యాంగాన్ని రచించిన గొప్ప మేధావి అంబేడ్కర్ అని కొనియాడారు. ఆయన అందించిన ఫలాలను అనుభవించి ఉన్నతస్థాయికి చేరిన కొందరు అంబేడ్కర్ సిద్ధంతాలను మరిచిపోయారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు చేరాలు, ఎల్లన్న, సుధాకర్, వెంకటస్వామి, మహేందర్, సదానందం, రాజమౌళి, చంద్రమౌళి, రమేశ్, జగదీశ్, శ్రీనివాస్, జయపాల్, ప్రసాద్, వెంకన్న, రవీందర్‌రెడ్డితో పాటు తదితరులు పాల్గొన్నారు.

ముర్రుపాలతో రోగనిరోధక శక్తి


కమలాపూర్ : చిన్నారులకు అన్నప్రాసన చేస్తున్న రేణుక, తదితరులు


శాయంపేటలో..


ఎల్కతుర్తి : తల్లులను సన్మానిస్తున్న వైద్యురాలు


కమలాపూర్ : బిడ్డ పుట్టిన గంటలోపు ముర్రుపాలు పట్టించాలని, దాంతో రోగనిరోధక శక్తి పెంపొందుతుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రేణుక, 4వ అంగన్‌వాడీ కేంద్రం టీచర్ పద్మ సూచించారు. కమలాపూర్‌లోని 1,4,5,6వ అంగన్‌వాడీ కేంద్రాల్లో సోమవారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ముర్రుపాలతో బిడ్డకు రోగనిరోధక శక్తి పెరుగుతుందని, బిడ్డ ఎదుగుదలకు ముర్రుపాలు తోడ్పడుతాయన్నారు. ఆరు నెలలు నిండే వరకు బిడ్డకు తల్లిపాలు పట్టించాలని, ఆరు నెలలు నిండిన తర్వాత అనుబంధ పోషకాహారం అందిస్తూ రెండేళ్ల వరకు తల్లిపాలు ఇవ్వాలన్నారు. అదేవిధంగా ఐవైసీఎఫ్ గురించి, క్వాలిటీ, క్వాంటిటీ, క్వీప్టెన్నీ గురించి వివరించారు. అనంతరం యార దీక్షిత, కొలుగూరి చింటూ, గొట్టె చిట్టీకి అన్నప్రాసన చేయించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు మొటం పద్మకుమారి, తిరుమల, పూర్ణిమ, తల్లులు, కిశోర బాలికలు తదితరులు పాల్గొన్నారు.

శాయంపేట : తల్లిపాలు బిడ్డకు ఆరోగ్యానిస్తుందని పరకాల సీడీపీఓ స్వాతి అన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా సోమవారం మండలంలోని పత్తిపాక, వసంతాపూర్ గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లిపాల వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తల్లిపాల ప్రాముఖ్యతను బాలింతలకు, గర్భిణులకు వివరించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సునీతా, పుణ్యవతి, అంగన్‌వాడీ టీచర్లు రమాదేవి, హైమావతి, చంద్రకళ, రత్నమాల, స్వప్న, రాణి, డాక్టర్ విద్యశ్రీ, ఏఎన్‌ఎంలు స్వరూప, శోభా, ఆశ వర్కర్లు సువర్ణ, మానస, ఆయాలు పాల్గొన్నారు.

ఎల్కతుర్తి : గర్భిణులకు ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే సురక్షిత ప్రసవాలు జరుగుతాయని వంగర పీహెచ్‌సీ వైద్యురాలు రుబీనా అన్నారు. సోమవారం భీమదేవరపల్లి మండలం వంగర ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. ఇటీవల ప్రసవమైన తల్లులకు వైద్య పరీక్షలు నిర్వహించి తీసుకోవాల్సిన పోషకాహారం గురించి వివరించారు. అనంతరం ఆస్పత్రిలో ప్రసవమైనప్పటి నుంచి ఆరునెలల పాటు పిల్లలకు తల్లిపాలు పట్టించిన తల్లులను శాలువాలతో ఘనంగా సన్మానించారు. సూపర్‌వైజర్ వాణి, సిబ్బంది విమల, రాధిక, స్వరూప, సునీతా, కల్పన, పద్మ, గర్భిణులు, తల్లులు పాల్గొన్నారు.

ప్రభుత్వ నిబంధనలు పాటించాలి


- ఎంపీడీఓ గుండె బాబు


మాట్లాడుతున్న ఎంపీడీఓ గుండె బాబు

కమలాపూర్ : ప్రభుత్వ నిబంధనల మేరకు ఇందిరమ్మ గృహ నిర్మాణ లబ్ధిదారులకు ఇసుక ఉచితంగా ఇవ్వాలని, కేవలం రవాణా చార్జీలు మాత్రమే తీసుకోవాలని, ఇసుక అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఎంపీడీఓ గుండె బాబు హెచ్చరించారు. తహసీల్దార్ సురేష్‌కుమార్, పోలీస్ ఇన్‌స్పెక్టర్ హరికృష్ణతో కలిసి మండలంలోని నేరెళ్లలో ట్రాక్టర్ యజమానులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, లబ్ధిదారులు, గ్రామస్తులతో సోమవారం అత్యవసర సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి ఇసుక విషయంలో ఎవరైనా అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం ఇన్‌స్పెక్టర్ హరికృష్ణ మాట్లాడుతూ.. ప్రభుత్వ నిబంధనల మేరకు ట్రాక్టర్ యజమానులు ఇందిరమ్మ గృహ లబ్ధిదారులకు ఇసుక సరఫరా చేయాలని, రాత్రి వేళల్లో అక్రమంగా ఇసుక రవాణా చేస్తే ట్రాక్టర్లను సీజ్ చేసి క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. అలాగే తహసీల్దార్ సురేష్‌కుమార్ మాట్లాడుతూ.. ఇందిరమ్మ గృహాల లబ్ధిదారులకు రెవెన్యూ శాఖ నుంచి ఇసుక కోసం టోకెన్లు జారీ చేస్తున్నామన్నారు. పంచాయతీ కార్యదర్శి విజయ్ కుమార్, జీపీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


ధర్నాకు ఉపాధ్యాయులు తరలిరావాలి

- యూపీఎస్సీ బాధ్యుడు సారయ్య


ధర్నా కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సారయ్య

ఐనవోలు : ఉపాధ్యాయ పోరాట సంఘం కమిటీ (యూపీఎస్సీ) ఆధ్వర్యంలో మంగళవారం ఏకశిలా పార్కువద్ద నిర్వహించనున్న ధర్నాకు ఉపాధ్యాయులు తరలిరావాలని యూపీఎస్సీ బాధ్యుడు బీమళ్ల సారయ్య పిలుపునిచ్చారు. సోమవారం మండల కేంద్రంలోని మండల విద్యా వనరుల కేంద్రంలో ధర్నాకు సంబంధించిన కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సారయ్య మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 19 నెలలు అవుతున్నా ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంలో నిర్లక్ష్యం వహిస్తోందన్నారు. ఏకీకృత సర్వీసు రూల్స్ రూపొందించి పోస్టులు భర్తీ చేయాలని, పెన్షనర్ల, వివిధ రకాల బిల్లులు వెంటనే విడుదల చేయాలని తదితర డిమాండ్ల పరిష్కారానికి ధర్నా చేపడుతున్నట్లు చెప్పారు. నాయకులు రాము, మహేందర్‌రెడ్డి, మహేందర్‌రావు, లక్ష్మీ, భవన్‌కుమార్, వెంకటేశ్వర్‌రావు, అశోక్‌కుమార్, రేవతి, రాజ్‌కుమార్, రూప పాల్గొన్నారు.

రక్తదానం మరొకరికి ప్రాణదానం


సర్టిఫికెట్ అందుకుంటున్న అశోక్

శాయంపేట : రక్తదానం చేస్తే మరొకరికి ప్రాణదానం చేసినట్లని పరకాల ప్రభుత్వ ఆస్పత్రి ఆర్ఎంఓ బాలకృష్ణ అన్నారు. శాయంపేట మండలంలోని పెద్ద కోడెపాక గ్రామానికి చెందిన సామజిక సేవకుడు అమ్మ అశోక్ సోమవారం 51వ సారి రక్తదానం చేశారు. పరకాల పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో రక్తం అవసరం ఉందని ఫోన్ ద్వారా అశోక్‌కు సమాచారం అందించినట్లు ఆర్ఎంఓ తెలిపారు. వెంటనే స్పందించిన అశోక్.. పరకాలలోని ప్రభుత్వ బ్లడ్ బ్యాంకులో రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఆయనను ఆర్ఎంఓ బాలకృష్ణ, వైద్యులు రమేశ్, కృష్ణ, ప్రశాంత్, ప్రమీల, తదితరులు అభినందించారు.